

గీత కార్మికులకు రక్షణ కవచ్ కిట్లు అందజేస్తున్న సబితారెడ్డి

తాటిచెట్లు ఎక్కేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

● ఎమ్మెల్యే సబితారెడ్డి సూచన

సరూర్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కల్లు తీయడానికి తాటి చెట్లు ఎక్కేటప్పుడు గౌడ సోదరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కులవృత్తిని నమ్ముకుని బతికే గీత కార్మికులు తమ ప్రాణాల మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన గీత కార్మికులకు సోమవారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్షణ కవచ్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కల్లు గీత సంఘాల ప్రతినిధులు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీరాజు

అన్ని వార్డుల అభివృద్ధికి కృషి : జయశ్రీరాజు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 24వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. సోమవారం కుంట్లూర్ 24వ వార్డు గణేశ్‌నగర్‌లో రూ. 18లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కందాడ అనుపమాసుప్రసేనారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయశ్రీరాజు మాట్లాడుతూ అభివృద్ధిలో వెనుకబడిన కాలనీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గ్యారల శ్రీనివాస్‌గౌడ్, చెవుల హరిశంకర్‌ముదిరాజ్, డీఈఈ శివానందం, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, కాలనీవాసులు నర్సింహారెడ్డి, శేఖర్ పగిల్ల, సంతోష్, అశోక్, అనిల్‌కుమార్, సత్యనారాయణ, అరుణ్ యాదవ్, అనసూయ, శైలజ, అంజి, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రయాత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం పసుమాములలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. చంద్రయాత్ అధ్యక్షుడు మోడెపు సత్యనారాయణగౌడ్ హాజరై విద్యార్థులకు బుక్‌లను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి వాణి, ఉపాధ్యాయులు సురేష్, సాయికుమార్, శ్యాంగౌడ్ పాల్గొన్నారు.



పాఠశాలను సందర్శిస్తున్న రంగారెడ్డి జిల్లా ఏఎంఓ జయచంద్రారెడ్డి

పాఠశాలను సందర్శించిన ఏఎంఓ

చంపాపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం రంగారెడ్డి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంఓ)జయచంద్రారెడ్డి సందర్శించారు. పాఠశాలలో నిర్వహించిన ఎస్ఏ-1 పరీక్షలను ఆయన పరిశీలించారు. పరీక్షా గదులతో పాటు ఉపాధ్యాయుల హాజరు, ఎండీఎం రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. విద్యార్థులను ఎఫ్ఎల్ఎన్ సాధించడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని హెచ్ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి ఏఎంఓ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను డీఈఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఏఎంఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, రజిత, అజిత, జ్యోతి, పురేందర్‌రెడ్డి, బి.అజిత, వినయ్‌కుమార్, కావ్య పాల్గొన్నారు.



డివైడర్ సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాత

డివైడర్ సుందరీకరణ పనుల పరిశీలన

చంపాపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని టీకేఆర్ కమాన్ నుంచి సాగర్‌రింగ్‌రోడ్ మీదుగా బీఎన్‌రెడ్డి వరకు చేపట్టిన డివైడర్ నిర్మాణంతో పాటు సుందరీకరణ పనులను సోమవారం జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్‌గౌడ్‌తో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.370కోట్లు కేటాయించిందని అన్నారు. వాహనదారులు సిగ్నలింగ్ వ్యవస్థను పాటించాలని, యూటర్న్‌ల వద్ద వాహనాలు తిరిగిరావాలని కోరారు. ప్రమాదాలను నివారించడం కోసం డివైడర్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న సదర్ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

మన్సూరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 31న మన్సూరాబాద్ చౌరస్తా వద్ద నిర్వహించనున్న సదర్ సమ్మేళనాన్ని యాదవ సోదరసోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మన్సూరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో అఖిలభారత యాదవ మహాసభ సభ్యులు పోచబోయిన గణేశ్‌యాదవ్, పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, కె.జగదీశ్‌యాదవ్, ఎం.శ్రీనివాస్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, కె.రవియాదవ్, కె.చిట్టియాదవ్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హయత్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1983-1984 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం హయత్‌నగర్‌లోని పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 40 సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకోవడం సంతోషంగా ఉందని పలువురు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖిల్లా మైసమ్మ ఆలయ అభివృద్ధికి చర్యలు

● మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

● ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఎల్‌బీనగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్‌నగర్ ఖిల్లా మైసమ్మ ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చెప్పారు. ఖిల్లా మైసమ్మ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం ఆలయ ఆవరణలో జరిగింది. ఆలయ చైర్మన్‌గా కుంచారపు సురేంద్రకుమార్ ధర్మకర్త లు వెంకటాచార్యులు, కేతావత్ రాజునాయక్, ఎల్లికంటి శ్రీశైలం, చిలుకూరి లక్ష్మి, అమృత, పగడాల శ్రీశైలం, సందీప్‌లతో దేవాదా య శాఖ అధికారి మురళీకృష్ణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేఎల్‌ఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆలయం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆలయం అభివృద్ధి చెందిందన్నారు. ఆలయ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. ఆలయ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసేందుకు పాలకవర్గం కృషి చేయాలని ఆయన సూచించారు. దేవాలయ అభివృద్ధి నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఎక్కువగా విడుదల చేయించేందుకు కృషి చేస్తానన్నారు. సమీపంలోని విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్‌కు అష్టలక్ష్మీ ఆలయం పేరు పెట్టాలని సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే అష్టలక్ష్మీ ఆలయం పేరును అధికారికంగా ఖరారు చేయడం జరుగుతుందన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం చైర్మన్ సురేంద్రకుమార్‌ను చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టి అభినందించారు. ఈ సభలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌కేపురం పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్, నాయకులు బేర బాలకిషన్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, గట్ల రవీంద్ర, రమేష్‌నేత, మాజీ కౌన్సిల ర్ ఢకియార్‌నాయక్, వెంకటేశంగుప్త, భూపాల్ రెడ్డి, సైదులు, జ్ఞానేశ్వర్‌యాదవ్, శేఖర్, కిరణ్‌కుమార్, లింగస్వామిగౌడ్, కళ్యాణ్, మహేందర్ పాల్గొన్నారు.



చైర్మన్ సురేంద్రకుమార్‌తో కేఎల్‌ఆర్, ఎమ్మెల్సీ దయానంద్, టీపీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి తదితరులు



ఆలయ ఆవరణలో చైర్మన్, ధర్మకర్తలతో ప్రమాణం చేయిస్తున్న దేవాదాయ శాఖ అధికారి మురళీకృష్ణ

కనులపండువగా బీరప్పస్వామి కల్యాణోత్సవం

● హాజరైన సబిత, కేఎల్లార్, చల్లా తదితరులు

సరూర్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని శ్రీబీరప్పస్వామి ఆలయంలో సోమవారం బీరప్ప కామరాతిదేవిల కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. కురుమ, యాదవ బంధువులు ఈ కల్యాణ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివసత్తుల నృత్యాలు, ఒగ్గు కళాకారుల ఆటపాటలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. బడంగ్‌పేట్ కురుమ సంఘం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌యాదవ్, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, టీపీసీసీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలగుడి రోడ్డును విస్తరించండి : ఎమ్మెల్యే దేవిరెడ్డి

హయత్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బొమ్మలగుడి రోడ్డును విస్తరించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కోరారు. సోమవారం మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని బొమ్మలగుడి, వీరన్నగుట్ట, లక్ష్మీభవానినగర్, వినాయకనగర్, సిరిహిల్స్, రాజరాజేశ్వరీ కాలనీలో జోనల్ కమిషనర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బొమ్మలగుడికి ఎదురుగా ఉన్న రోడ్డు పూర్తిగా కుంచించుకుపోయిందని దానిని విస్తరించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. రోడ్డుకు రెండు వైపుల ఉన్న విద్యుత్ స్తంభాలను ఒకే వైపు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ రోడ్లు, డ్రైన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్‌లు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ బొమ్మలగుడి రోడ్డు విస్తరణతో పాటు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. తగిన ఆదేశాలు త్వరలో జారీ చేస్తామని అన్నారు. సబ్ రోడ్లు, జిమ్, కమ్యూనిటీ హాల్‌లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు జగదీష్ యాదవ్, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.



సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే

రూ.55లక్షలతో క్లాక్ టవర్ నిర్మాణం : ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని ఆజంపుర చమన్‌లో కొత్తగా నిర్మిస్తున్న క్లాక్ టవర్ నిర్మాణ పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం పరిశీలించారు. సుమారు రూ.55లక్షల నిధులను ఇదివరకే మంజూరు చేయించినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే క్లాక్ టవర్ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయన్నారు. ఇదివరకు ఇక్కడున్న ఆజంపుర చమన్ బిచ్చగాళ్లకు, వైట్‌నర్లు వాడే యువకులకు, తోపుడుబండు, ఫుట్‌పాత్ వ్యాపారులకు అడ్డాగా మారిందన్నారు. ఆజంపుర చమన్‌ను పూర్తిగా కుదించేసి అందులో క్లాక్ టవర్ నిర్మించాలని నిర్ణయించి ప్రతిపాదనలు తయారు చేయించడంతోపాటు నిధులను కూడా మంజూరు చేయించినట్లు ఆయన వివరించారు. క్లాక్ టవర్ నిర్మాణంతోపాటు మరో రూ.50లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా దాదాపుగా పూర్తి చేయించినట్లు తెలిపారు. క్లాక్ టవర్, సీసీ రోడ్ల నిర్మాణానికి గాను రూ.కోటి 5లక్షల నిధులు వెచ్చించినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఆజంపుర చమన్‌లో కొత్తగా నిర్మిస్తున్న క్లాక్ టవర్ చుట్టూ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులు నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఈఈ పీర్‌సింగ్, ఏఈ మల్లికార్జున్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గజానంద్ పాల్గొన్నారు.



క్లాక్ టవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

బీసీ ముఖ్యమంత్రే బహుజనుల ఎజెండా : సూర్యప్రకాష్

ఎల్‌బీనగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీని ముఖ్యమంత్రిని చేయడమే బహుజనుల ఎజెండా అని బీఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ స్పష్టం చేశారు. సోమవారం కొత్తపేట చౌరస్తాలోని వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకత్వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలన, దేశంలో పదేళ్ల బీజేపీ పాలనపై ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు. దళిత, బహుజనులపై సామాజిక, ఆర్థిక, రాజకీయ అణచివేత జరుగుతూనే ఉన్నదన్నారు. అత్యల్పంగా ఉన్న అగ్రవర్ణాలు అత్యధికంగా ఉన్న బహుజన వర్గాలను పాలిస్తున్నాయన్నారు. శ్రీలంకలో నూతన వామపక్ష ప్రభుత్వ స్ఫూర్తితో తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను అధికారంలోకి తీసుకువచ్చే క్రమంలో ఫిబ్రవరిలో లక్ష మందితో బహుజన బహిరంగసభను నిర్వహించనున్నామన్నారు. దీనికి బీఎల్ఎఫ్ భాగస్వామ్య రాజకీయ పార్టీలైన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా, ప్రజాపోరాట సమితి, ఎంసీపీఐ(యు), బహుజన కమ్యూనిస్టు పార్టీ, సీపీఐ ఎంఎల్(రెడ్‌స్టార్), సీపీఐఎంఎల్ (రెడ్ ఫ్లాగ్) వంటి ఏడు రాజకీయ పార్టీలు తమ బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరునూరైనా బీసీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి అన్నారు. వర్కర్స్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పు యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసు కే యాదవ్, బీఎల్‌పీ రాష్ట్ర కోశాధికారి మారోజు సునీల్, వర్కర్స్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగయ్య ముదిరాజ్, హైదరాబాద్ ఇన్‌చార్జి పండరీనాథ్ నేత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రాములు, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బండారి వెంకటస్వామి, విశ్వకర్మ పంచ వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరచారి, మహిళా సమాఖ్య నాయకురాలు అరుణ, వర్కర్స్ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్, రాజేశ్వర్ రావు, ధర్మాచారి, ఉమాదేవి, సంధ్య, తిప్పర్తి వెంకటాచారి, వెంకటేశం, స్వామిచారి, నర్సింహాచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్

బచ్‌పన్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

వనస్థలిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం హిల్‌కాలనీలోని బచ్‌పన్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బచ్‌పన్ స్కూల్ రీజనల్ డైరెక్టర్ కె.రూపారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే ఇంట్లో నానమ్మ అమ్మమ్మలు, తాతయ్యలు మన సంస్కృతి, సంప్రదాయాలు, నీతి కథలు, జీవితానికి ఉపయోగపడే మంచి విషయాలను బోధించాలన్నారు. చిన్నారులకు ఇంట్లో పెద్దవారి అనుభవాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బచ్‌పన్ స్కూల్‌లో పేరెంట్స్ డే వేడుకల్లో పాఠశాల సిబ్బంది

ఎల్బీనగర్ స్థలాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ నాగోల్ నేత అనంతుల సురేందర్‌రెడ్డి

కొత్తపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాగోల్ నేత అనంతుల సురేందర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఆదివారం ఆయన సీఎం నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా ఆయను కలిసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ఎల్బీనగర్‌లో నెలకొన్న పలు సమస్యలను సీఎంకు వివరించారు. ప్రధానంగా కొత్తపేట, నాగోల్ తదితర ప్రాంతాల్లో వెలుగు చూస్తున్న స్థలాల ఆక్రమణలను సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట మరో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండ సురేందర్‌రెడ్డి ఉన్నారు.



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అనంతుల సురేందర్‌రెడ్డి, బండ సురేందర్‌రెడ్డి

కంఠమహేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజ్‌పూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామి నూతన ఆలయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కాల బాల్‌రాజ్ గౌడ్, గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



ఆలయ శంకుస్థాపనలో మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అమ్మవారి విగ్రహ ధ్వంసంపై న్యాయవాదుల ఆందోళన

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ధ్వంసంపై రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదులు భగ్గుమన్నారు. హిందూ న్యాయవాదుల ఐక్యవేదిక కన్వీనర్ పీఠం ప్రదీప్ ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం విజయవాడ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. అమ్మవారి విగ్రహ ధ్వంసం చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి వారి వెనక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు పి. శ్రీనాథ్, నరేష్, అర్చన, మీనాక్షి, రూప, నగేష్, విజయ్‌నాయక్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



జిల్లా కోర్టుల ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిలు అన్నారు. సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సామనగర్‌లో రోడ్డు పనులు చేపట్టాలని కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, నవజీవన్‌రెడ్డిలకు కాలనీవాసులు సమాచారం అందజేశారు. ఈ మేరకు కాలనీలో పర్యటించిన కార్పొరేటర్లు మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు వారు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి

గొర్రెలు, మేకల దొంగల అరెస్టు

● 5 మేకలు, లక్ష నలబై వేలు స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా ఇంటి వద్ద కట్టేసిన గొర్రెలు, మేకలను దొంగిలిస్తున్న ఇద్దరు దొంగలను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5 మేకలతో పాటు రూ. లక్ష నలబై వేలను స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన నాయకపు నాగరాజు ఇంటి వద్ద కట్టేసిన 5 మేకలను ఈనెల 15వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో అతడు మరుసటి రోజు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు సోమవారం కొత్తగూడెం చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నల్గొండ జిల్లాలోని ఆలీనగర్‌కు చెందిన సంపంగి వెంకటేష్, ముకుందాపురానికి చెందిన సంపంగి కోటేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు మేకలు, గొర్రెలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. గతంలో యాచారం, మహేశ్వరం, మంచాల్, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, నారాయణపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. గతంలో వీరిద్దరు జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత కూడా చోరీలకు పాల్పడుతున్నారు. సోమవారం ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.



కోటేష్



వెంకటేష్

ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఉన్నత విద్య అందుకోవాలి

చాదర్‌ఘాట్: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఉన్నత విద్యను అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు విద్యారంభ అవగాహన కార్యక్రమాన్ని ఆయన ఓయూ అకాడమిక్ ఆడిట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనాథ్‌రెడ్డి, పోస్టల్ అకౌంట్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ మఠం బ్రహ్మచారి శ్యాంమహరాజ్‌లతో కలిసి ప్రా రంభించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసేందుకు ఉన్నత విద్యలో తమ ప్రతిభను చాటుకోవడంతోపాటు కొత్తకొత్త ఇన్నోవేషన్‌తో అభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల అధ్యక్షుడు ఎం.జ్ఞానేశ్వరి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. అప్పారావు పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి పారిపోయిన ఇద్దరు విద్యార్థులు

● ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులకు అప్పగింత

వనస్థలిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హాస్టల్లో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు ఆదివారం అర్ధరాత్రి హాస్టల్ నుంచి తప్పించుకునిపోయి సోమవారం సాయంత్రం ఇద్దరు ఆచూకీ లభ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన ఆర్. చైతన్య(14), నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మిడ్జిల్ గ్రామానికి చెందిన జశ్వంత్‌రెడ్డి(14)లు ఇద్దరు వనస్థలిపురం డివిజన్ వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి స్కూల్ హాస్టల్‌లో ఉంటు తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. కాగా ఈనెల 20న(ఆదివారం) జశ్వంత్‌రెడ్డి తండ్రికి ఆరోగ్యం బాలేదని జశ్వంత్‌ను ఇంటికి తీసుకెళ్తామని అతని బంధువులు హాస్టల్ నిర్వాహకులను కోరారు. దీంతో హాస్టల్ నిర్వాహకులు సోమవారం పరీక్ష ఉన్నది పరీక్ష రాసినంక తీసుకెళ్లండని తెలిపారు. ఈ క్రమంలో జశ్వంత్‌రెడ్డి తన సమీప గ్రామస్థుడైన తన తోటి విద్యార్థి చైతన్యతో ఈ విషయం చెప్పాడు. దీంతో ఇద్దరు కలిసి ఆదివారం అర్ధరాత్రి 12.30 సమయంలో పాఠశాల మూడో అంతస్తులో ఉన్న హాస్టల్ నుంచి కిందికి వచ్చి గేటు పక్కనే ఉన్న పాత గ్రిల్స్‌ను తొలగించి అందులో నుంచి తప్పించుకుని బయటపడ్డారు. ఈ క్రమంలో పాఠశాల నుంచి సమీపంలోని హస్తినాపురం చేరుకుని అక్కడ నుంచి ఆటోలో సంతోష్‌నగర్ చౌరస్తాకు చేరుకున్నారు. రాత్రి కావడంతో విద్యార్థులు తమ గ్రామానికి వెళ్లడానికి ఎలాంటి బస్సులు లేకపోవడంతో రాత్రంత అక్కడే గడిపారు. తెల్లవారుజామున సంతోష్‌నగర్ చౌరస్తా నుంచి బస్సు ఎక్కి రంగాపూర్ గ్రామానికి వెళ్తున్నానని చైతన్య తన స్నేహితుడు జశ్వంత్‌కు చెప్పాడు. కాగా జశ్వంత్ తన ఇంటికి ఎలా వెళ్లాలో తెలియకపోవడంతో అక్కడ ఉన్న ఓ వ్యక్తి ఫోన్ నుంచి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో జశ్వంత్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే సీసీ కెమెరాల సహాయంతో జశ్వంత్ ఆచూకీ గుర్తించి అక్కడికి చేరుకుని సోమవారం మధ్యాహ్నం జశ్వంత్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చారు. తన ఇంటికి వెళ్తున్నానని చెప్పి బస్సులో బయలుదేరిన చైతన్య తుక్కుగూడలో సోమవారం సాయంత్రం బస్సు దిగి తన బంధువులకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు తుక్కుగూడలో ఉన్న చైతన్యను పట్టుకుని స్టేషన్‌కు తీసుకవచ్చారు. అనంతరం ఇద్దరు విద్యార్థులను వారి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించడంతో ఊపిరి పీల్చుకున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న జశ్వంత్‌రెడ్డి, చైతన్య